క్లుప్తంగా

మోడల్ స్కూల్‌లో బోరు ఏర్పాటు



పాఠశాల ఆవరణలో బోరు వేస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని మోడల్ స్కూల్ ఆవరణలో మంగళవారం రామ్‌కో సిమెంట్ సహకారంతో బోరు ఏర్పాటు చేశారు. పాఠశాలలో వివిధ గ్రామాలకు చెందిన 600 మంది విద్యార్థులు విద్యనభ్యశిస్తుండగా వందమంది బాలికలు పాఠశాల ఆవరణలోని హాస్టల్‌లో ఉంటున్నారు. నీళ్ల సౌకర్యం లేక గ్రామ పంచాయితీ నుంచి పైపులైన్ ద్వారా సరఫరా అయ్యే నీటిని సంప్‌లోకి నింపుకుని ఉపయోగించుకుంటున్నారు. నీటి సమస్యను ప్రిన్సిపాల్ చంద్రసేనారెడ్డి రామ్‌కో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన యాజమాన్యం బోరు వేయడంతో నీళ్లు సమృద్ధిగా పడ్డాయి. త్వరలోనే మోటార్ అమర్చనున్నారు.

నేడు ఆధార్ ప్రత్యేక క్యాంప్

సంజామల: మండల పరిధిలోని కమలపూరి, ఆర్ లింగందిన్నె సచివాలయాల్లో బుధవారం ఆధార్ ప్రత్యేక క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగకుమార్ మంగళవారం తెలిపారు. ప్రత్యేక క్యాప్‌లో కొత్తగా నమోదు, ఆధార్ మార్పులు, చేర్పుల సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఒక్కరోజు జరిగే ప్రత్యేక క్యాంప్‌ను సచివాలయాల పరిధిలోని అక్కంపల్లె, వసంతాపురం, బొందలదిన్నె, హోత్రందిన్నె, నట్లకొత్తురు గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దివ్యాంగురాలికి ట్రై సైకిల్ అందజేత



భాగ్యమ్మకు ట్రై సైకిల్ అందజేసిన యాగంటిరెడ్డి

బనగానపల్లెరూరల్ : పట్టణానికి చెందిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పారిశ్రామిక వేత్త, దొనపాటి యాగంటిరెడ్డి సొంత నిధులతో మంగళవారం పాతపాడు గ్రామానికి చెందిన దివ్యాంగురాలు భాగ్యమ్మకు ట్రై సైకిల్ ఉచితంగా అందజేశారు. ఆయన స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో యాగంటిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకుడు బెడదల చంద్రశేఖర్‌రెడ్డి సూచన మేరకు భాగ్యమ్మకు సైకిల్ అందజేశామన్నారు. పూర్తిగా నడవలేని దివ్యాంగులు ట్రై సైకిల్ కోసం తనను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు దొనపాటి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌ను పరామర్శించిన సీఎం



కేశవయ్య గౌడ్‌ను పరామర్శిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

డోన్: కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ టీఈ చిన్న కేశవయ్య గౌడ్‌ను మంగళవారం డోన్‌లో హెలిప్యాడ్ ప్రాంగణంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయనతో ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కేశవయ్య గౌడుతో పాటు ఆయన సతీమణి కౌన్సిలర్ టమటం లక్ష్మీదేవి ఉన్నారు.

హెచ్‌ఎం రామచంద్రారెడ్డి సస్పెన్షన్

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలోని కొండపేట ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం రామచంద్రారెడ్డిని జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు ఎంఈఓ స్వరూప మంగళవారం తెలిపారు. గతనెల 26వ తేదీన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ కొండపేట ఎంపీపీ పాఠశాలను తనిఖీ చేయడం జరిగింది. ఆ సమయంలో ప్రిన్సిపాల్ సెక్రటరీ అడిగిన ప్రశ్నలకు హెచ్‌ఎం రామచంద్రారెడ్డి సమాధానాలు సంతృప్తికరంగా లేవు. ప్రిన్సిపాల్ సెక్రటరీ ఆదేశాల మేరకు హెచ్‌ఎంను మూడు రోజుల క్రితం సస్పెండ్ చేసినట్లు ఎంఈఓ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆళ్లగడ్డ : పట్టణంలో మోటర్ సైకిల్, కారు ఢీకొన్న ప్రమాదంలో పట్టణానికి చెందిన యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని దొమ్మరి కాలనీకి చెందిన శివరాం (18) మోటర్‌సైకిల్‌పై నంద్యాల వైపు నుంచి వస్తుండగా కొత్త మార్కెట్ యార్డ్ సమీపంలో సందులో నుంచి వస్తున్న కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ శివరంను నంద్యాల వైద్యశాలకు తరలించగా.. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటసుబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ రమేష్‌బాబు తెలిపారు.

డోన్ నియోజకవర్గ ప్రజల అదృష్టం

అపర భగీరథుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- ఇచ్చిన మాట ప్రకారం డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దిన మహానుభావుడు
- ప్రజాధనం దుర్వినియోగం చేసి ప్రజలను మభ్యపెట్టిన మోసగాడు చంద్రబాబునాయుడు
- ఆకర్షణీయమైన అబద్ధాలతో మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్న తండ్రీ కొడుకులు
- వచ్చే సమావేశాల్లో చంద్రబాబు, ఆయన పుత్రరత్నం అవినీతిపై అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ప్రజలకు వివరిస్తాం
- ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రెండెడ్ల బండి నమూనాను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డోన్ : గత ఎన్నికల ముందు రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా తనను ప్రకటించడమే కాకుండా డోన్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న మహనీయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కొనియాడారు. నంద్యాల, కర్నూలు జిల్లాల్లో హంద్రీనీవా ప్రధాన కాల్వ నుండి 77 చెరువులకు సాగు నీటిని అందించే లక్కసాగరం ఎత్తిపోతల పథకాన్ని మంగళవారం ప్రారంభించిన అనంతరం డోన్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ మనిజీర్ జిలానీ సామూన్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో మంత్రి బుగ్గన మాట్లాడుతూ డోన్ నియోజకర్గంలో రూ.2300 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు ముఖ్యమంత్రి చొరవతోనే చేపట్టడం జరిగిందన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలుతో పాటు అభివృద్ధి పనులు చేపట్టడంలో అగ్రగామిగా ఉన్న డోన్ నియోజకవర్గ ప్రజలు నిజంగా అదృష్టవంతులని, ఇందుకు కారణం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని మంత్రి వివరించారు.

మంత్రి బుగ్గన తనయునితో సీఎం ఆత్మీయ ఆలింగనం

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హాజరైన డోన్ బహిరంగ సభలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్‌రెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మంత్రి తన కుమారున్ని సీఎంకు పరిచయం చేయగానే ఆయన ఆత్మీయంగా అర్జున్‌తో కరచాలనం చేసి ఆలింగనం చేసుకోవడంతో సభికులు పెద్దఎత్తున హర్షాధ్వనాలు చేశారు.

నాగలి బహూకరించిన డోన్ ఎంపీపీ

రైతు పక్షపాతి, రైతు బాంధవుడు అయిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి డోన్ మండల ప్రజల తరుపున మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తదితరులు వేదికపై సీఎంకు నాగలిని బహూకరించారు. ఆదేవిధంగా ప్యాపిలి మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు మెట్టు వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరాంరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిట్టిరెడ్డి, రామాంజనేయులు తదితరులు రెండెడ్ల బండి నమూనాలను సీఎంకు బుగ్గన చేతులమీదుగా బహూకరించారు. ఈ సందర్భంగా డోన్ పట్టణ ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు రూ.100కోట్ల ప్రత్యేక గ్రాంట్‌ను మంజూరు చేయాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ సీఎంకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్‌హుసేన్, బేతంచెర్ల ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చలంరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుపసాద్, బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి శీలం భాస్కర్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు దినేష్‌గౌడ్, మల్యాల శ్రీనివాసరెడ్డి, వెంకోబరావు, భాస్కర్‌రెడ్డి, పురుషోత్తమ రెడ్డి, గజేంద్రనాథ్‌రెడ్డి, కురుకుంద హరి, బోరా మల్లికార్జునరెడ్డి, మూర్తుజావలి, ఖాజా పాల్గొన్నారు.



మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్‌రెడ్డిని అభినందిస్తున్న సీఎం



సీఎం బహిరంగ సభకు తరలివచ్చిన జనం







సీఎంకు ఘనస్వాగతం

ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనకు విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోన్‌రెడ్డికి మంగళవారం ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఓర్వకల్లు ఎయిర్‌పోర్ట్‌లో సీఎంకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

బనగానపల్లె: మండల పరిధిలోని రామతీర్థంలో బుధవారం పలు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.22లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.21 లక్షలతో ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ క్లీనిక్‌తో పాటు రూ.27 లక్షలతో నిర్మించిన పైపులైన్ పనులకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభోత్సవం చేస్తారని చెప్పారు. అదేవిధంగా రూ.75 లక్షలతో చేపట్టనున్న స్థానిక కాశయ్య తోటలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు,సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

కొనసాగిన రిలే నిరాహార దీక్షలు

డోన్ టౌన్ : ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం తొమ్మిదవ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ నాయకులు గుండాల ఈశ్వరయ్య మాట్లాడుతూ గతంలో ప్రతి పక్షంలో ఉన్నప్పుడు నరేంద్రమోడీ తాము అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో చట్ట బద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఎస్సీ వర్గీకరణ చేసి మాదిగలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ జిల్లా కో కన్వీనర్ పులికేశవయ్యమాదిగ, నాయకులు రామాంజనేయులు, చినరాయుడు, నాగేంద్ర, మాదన్న, ఉశేనప్ప పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని కొట్ల స్టేడియంలో నూతనంగా ఈ విద్యా సంవత్సరం 2023-24 నుంచి ప్రారంభిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల్లో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ వేణుగోపాల్‌రావ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేది నుంచి 22 తేది వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి కర్నూలు నంద్యాల జిల్లాకు చెందిన 40మంది విద్యార్థులకు సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. దరఖాస్తు అందజేసిన అభ్యర్థులకు ఈ నెల 24వ తేదీ ఆదివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కర్నూ లు సమీపంలోని దిన్నెదేవరపాడు అంబేడ్కర్ గురుకుల పాఠశాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. రిజర్వేషన్ పద్ధతిలో సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ఐదవ తరగతికి చెందిన తెలుగు, ఇంగ్లిష్, గణితం, ఇ.వీయస్ సబ్జెక్టులకు సంబంధించి 50 మార్కులకు ప్రశ్న పత్రం ఉంటుందన్నారు.

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా..!



కోవెలకుంట్లలో నాట్ల కాంప్లెక్స్ ఆవరణలో పూజలందుకుంటున్న 13 అడుగుల బొజ్జ గణపయ్య



అవుకులోని ముస్లిం వీధిలో కొలువుదీరిన గణపయ్య



బేతంచెర్ల అమ్మవారిశాల వద్ద కొలువుదీరిన గణనాథుడు



కొలిమిగుండ్లలో పూజలు నిర్వహిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు



కోవెలకుంట్ల నాగులకట్ట వీధిలో కొలువుదీరిన వినాయకుడిని దర్శించుకున్న కాటసాని ఓబుల్‌రెడ్డి





పెట్నికోటలో గణపయ్యను దర్శించుకుంటున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, గణపయ్యకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆయన సతీమని కాటసాని జయమ్మ

- వాడవాడలా కొలువుదీరిన గణనాథులు

కోవెలకుంట్ల:బనగానపల్లె నియోజకవర్గంలో సోమవారం వినాయక చవితి పండుగను ఘనంగా జరుపుకున్నారు. వాడవాడలా గణపయ్యలు కొలువుదీరారు. కోవెలకుంట్ల పట్టణంలో 45 చోట్ల, గ్రామీణ ప్రాంతాల్లో 55 చోట్ల వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్‌సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ న్యాయ విభాగ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, తదితరులు వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జోళదరాశి గ్రామంలో సర్పంచ్ నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

బేతంచెర్ల: మండల కేంద్రం బేతంచెర్లతోపాటు గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలో కేంద్ర గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 38 పైగా వినాయకులు కొలువుదీరారు. సిమెంట్ నగర్‌లో ఉపసర్పంచ్ మమత, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యం ఆధ్వర్యంలో వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు.

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లతోపాటు గ్రామాల్లో గణనాథులు కొలువుదీరారు. పెట్నికోటలో ఏర్పాటు చేసిన వినాయకుడి ప్రతిమను జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొలిమిగుండ్లలో ప్రధాన రహదారి చెంతన వాల్మీకి సంఘం నాయకుల ఆధ్వర్యంలో భారీ వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. చెక్కభజన తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కొలువుదీరిన గణనాథులు

బనగానపల్లె రూరల్ : మండల కేంద్రం బనగానపల్లెతోపాటు గ్రామాల్లో గణనాథులు కొలువు దీరారు. స్వగృహ ఆవరణలో ఏర్పాటు చేసిన గణనాథుడికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయన సతీమణి కాటసాని జయమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఇంటి సమీపంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహానికి మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కాటసాని ప్రసాదరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు.పెండేకంటినగర్‌లో ఏర్పాటు చేసిన స్వామివారి ప్రతిమను అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. స్థానిక బోయపేట కాలనీలో యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపయ్యను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబుల్‌రెడ్డి దర్శించుకొని పూజలు చేశారు. మండలంలోని దేవనగర్ గ్రామం కాలనీవాసులు ఏర్పాటు చేసి న వినాయక విగ్రహాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి దర్శించుకొని పూజలు చేశారు.

అవుకు: మండలంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం అవుకుతో పాటు గ్రామాల్లో దాదాపు 100 మండపాల్లో బొజ్జ గణపయ్యలను కొలువుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండవ రోజు మంగళవారం ఆయా మండపాల వద్ద నిర్వహించిన ఆటల పోటీలు, పాటల కచేరీలు, యువకులు నృత్యాలతో సందడి నెలకొంది.

నేడు విగ్రహాల నిమజ్జనం

వినాయక విగ్రహాల నిమజ్జనం బుధవారం నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు అవుకు, చెర్లోపల్లె, రామాపురం, ఓబుళాపురం, శింగనపల్లె తదితర గ్రామాల్లోని వినాయక విగ్రహాలను అవుకు రిజర్వాయర్‌లో నిమజ్జనం చేసే అవకాశం ఉన్నందున గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు పోలీసులు సూచనలు చేశారు.

డోన్ టౌన్ : వినాయక చవితి పర్వ దినం పురస్కరించుకొని వాడవాడలా గణనాథులు కొలువయ్యారు. ఆయా మండపాల్లా కొలువుదీరిన గణపయ్యలను మంగళవారం పెద్దఎత్తున భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. బుధవారం నిమజ్జనం కార్యక్రమాలు జరుగనున్నాయి.

నేడు వెంకటాపురం చెరువులో నిమజ్జనం

మండలంలోని వెంకటాపురం తుమ్మల చెరువులో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చురుగ్గా సాగుతున్నాయి. మధ్యాహ్నం నుంచే విగ్రహాలను తరలించాలని పోలీసులు,అధికారులు మండపాల నిర్వాహకులకు సూచించారు.



బేతంచర్లలో చిన్నారుల నృత్యాలు



పలుకూరులో వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి



కొండపేటలోని జెండా కట్ట వద్ద కొలువైన వరసిద్ధి వినాయకుడు



సాయినగర్ కాలనీలో కొలువైన వినాయకుడు

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ మద్దతు కుటుంబాలు



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీకి చెందిన కుటుంబాలు

బనగానపల్లె:అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన టీడీపీకి చెందిన పది కుటుంబాలు ఆ పార్టీని వీడి మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందిన రాజశేఖర్, కిట్టు, కుమార్, జాన్సన్, సురేష్, హరి, రవి, విజయ్, యోహన్, వేణు, జాన్, ఇసాక్ తదితరులకు ఎమ్మెల్యే కాటసాని వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పార్టీలు, కులాలు మతాలకు అతీతంగా అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షతులై పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారికి అన్నివిధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన నాయకులు వెంకటసుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, కంబగిరి, రామారావు, ప్రమోద్, వలి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అష్టాదళ పాద పద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబా చంద్రశేఖర దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంచే ప్రత్యేక అభిషేకం చేశారు. అమ్మవారిని మంగళగౌరి అలంకారంలో అలంకరించి అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడి బియ్యం కార్యక్రమాన్ని సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, ఆరవేటి వాసు, విజయకుమార్, నరసింహ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం చేయాలి

బనగానపల్లెరూరల్ : ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు ఐకమత్యంగా విజయవంతం చేయాలని డీపీఎంఓ (జిల్లా ప్రోగ్రామింగ్ మానిటరింగ్ ఆఫీసర్) డాక్టర్ శ్రీమంత్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పొదుపు భవనంలో ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష పథకంపై అవగాహన కార్యక్రమం జరిగింది. డీపీఎంఓ మాట్లాడుతూ ఈ పథకం మూడు దశలో జరుగుతుందని, మొదటి దశలో ప్రజాప్రతినిధులు వలంటర్లు, ఏఎన్ఎంలు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ఈ పథకంపై అవగాహన కల్పించాలన్నారు. రెండోవ దశలో సీహెచ్ఓ, ఏఎన్ఎంలు ఆయా కుటుంబాల సభ్యులందరికీ ఆరోగ్యపరీక్షలు చేస్తారన్నారు. అనంతరం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించే తేదీలను వలంటీర్ల ద్వారా సమాచారం ఇవ్వాలని సూచించారు. బనగానపల్లె మండలంలో అక్టోబర్ 3వ తేదీన ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శివశంకరుడు, ఈఓఆర్‌డీ గురుప్రసాద్, ఈఓ ఖాలీల్, ఎంఎల్‌ఓ రవి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రామింగ్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీమంత్